క్లుప్తంగా

భాస్కర్‌రెడ్డికి భూమన నివాళి



తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి ఆదివారం మృతి చెందారు. ఇది తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకరరెడ్డి ఆయన నివాసానికి వెళ్లి భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

బ్రహ్మశ్రీ ఆశ్రమంలో లోక్ సభ స్పీకర్



లోకసభ స్పీకర్ ఓం బిర్లాకు లక్ష్మీనరసింహ ప్రతిమను ఇస్తున్న బ్రహ్మశ్రీ గురూజీ

రామచంద్రాపురం: లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ఆదివారం సాయంత్రం మండలంలో సి.రామాపురం సమీపంలోని శ్రీ బ్రహ్మర్షి గురూజీ ఆశ్రమాన్ని సందర్శించి లక్ష్మీనారాయణ మందిరం, జైన్ మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మర్షి గురూజీ ఆశీస్సులు పొందారు. తొలుత ఆశ్రమ నిర్వాహకులు మేళతాళాలతో ఆయనకు స్వాగతం పలికారు.లక్ష్మీ నరసింహస్వామి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు మారిషస్ ప్రధాని రాక

–కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించిన పోలీసులు

తిరుమల : శ్రీ వేంకటేశ్వరస్వామివారి దర్శనార్థం మారిషస్ ప్రధాని నవీనచంద్ర రామ్‌గులం సోమవారం తిరుమలకు రానున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఆదివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం నుంచి శ్రీపద్మావతి అతిథి గృహం..అక్కడి నుంచి శ్రీవారి ఆలయం వరకు ట్రయల్ రన్ నిర్వహించారు.కార్యక్రమంలో టీటీడీ వీజీఓ సురేంద్ర, తిరుమల టూటౌన్ పీఎస్ సీఐ శ్రీరాముడు, ఎస్ఐ రమేష్, ఇంటెలిజెన్స్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి: బీటీఏ

పాకాల: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్ఎమ్ఎస్ పాఠశాలలో బీటీఏ మండల అధ్యక్షుడు జ్యోతి ప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జాతీయ ఉపాధ్యక్షుడు గుండ్లపల్లి ఆంజనేయులు మాట్లాడారు. పలువురు బీటీఏ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



చంద్రగిరి: మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ శ్రీలక్ష్మీనగర్‌కు చెందిన భూమిరెడ్డి నరేష్ రెడ్డి, భవాని దంపతులు ఆదివారం నాగయ్యగారిపల్లె సమీపంలోని అరుణోదయ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ప్రతి ఏటా తమ కుమారుడు తిషాంత్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని ఈ వితరణ ఏడేళ్లుగా చేస్తున్నట్టు చెప్పారు. సంపూర్ణమ్మ, జయచంద్ర, లలిత, లక్ష్మి, చిన్ని, హరీష్(సాయి), వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కోటలో ప్రముఖులకు ఆతిథ్యం



కోటలో లోకసభ స్పీకర్ ఓం బిర్లా, ఇతర ప్రముఖులు

చంద్రగిరి: మహిళా సాధికారత కమిటీ జాతీయ సదస్సుకు హాజరైన ప్రముఖులకు ఆదివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం తరఫున చంద్రగిరి రాయలవారికోటలో ఆతిథ్యమిచ్చారు. లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడితో పాటు జిల్లా కలెక్టర్ ఇతర ప్రముఖులకు స్వాగతం పలికారు. అనంతరం చంద్రగిరి కోటలో ప్రదర్శించిన సౌండ్ అండ్ లైటింగ్ షోను అతిథులు తిలకించారు. కుంభకోయ, దిమ్సా, గంతజాతర నృత్యం, కూచిపూడి నృత్యం ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం అతిథులకు రాయలవారి చరిత్ర, కోట ప్రాశస్త్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు, రాష్ట్ర శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, ఇతర రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ఐక్యతతో అభివృద్ధి: ఎమ్మెల్యే

తిరుపతి కల్చరల్: బలిజలందరూ ఐక్యతతో అభివృద్ధి పథంలో పయనించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చేనేత, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఓ హోటల్లో బలిజసేన రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. బలిజసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడారు. అనంతరం బలిజసేన లోగో కలిగిన గొడుగులను పంపిణీ చేశారు. బలిజసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం కొండ సురేష్, ఉపాధ్యక్షులు రాయని రమేష్, మస్తాన్ రాయల్, సంయుక్త కార్యదర్శి గీతాంజలి, రెడ్డి రాణి, కో–ఆర్డినేటర్ రామకృష్ణ, యూత్ అధ్యక్షుడు అనంత రాయల్, నరసింహ, కిరణ్‌బాబు, శివ, మురళి, హరీష్, ప్రసాద్, అనూష, సావిత్రమ్మ పాల్గొన్నారు.

రూ.50లక్షల విలువైన కాలువ భూమి హాంఫట్!

- దర్జాగా ఆక్రమించి టీడీపీ నేతల అక్రమ నిర్మాణం
- రెవెన్యూ అధికారులకు మల్లవయ్యపల్లె వాసులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం!



ప్రభుత్వ కాలువ భూమిలో అక్రమంగా చేస్తున్న నిర్మాణ పనులు

చంద్రగిరి: లక్షల విలువైన భూమిని అధికార పార్టీ అండతో అక్రమించి అక్రమ నిర్మాణానికి పూనుకున్న ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని దోర్నకంబాల పంచాయతీ మల్లయ్యపల్లెలో సర్వే నంబరు 1065లో సుమారు 32 సెంట్ల ప్రభుత్వ కాలువ భూమి రోడ్డుకు ఆనుకుని ఉండడంతో టీడీపీకి చెందిన కొంత మంది నేతల కన్ను పడింది. గతంలో స్థలాన్ని చదును చేయడంతో గ్రామస్తులు నాలుగు రోజుల క్రితం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు పరిశీలించి, ఎలాంటి ఆక్రమణలకు పాల్పడినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలో ఆదివారం సెలవు దినం కావడంతో ఆక్రమించుకోవడంతో పాటు అక్రమ నిర్మాణాలకు పూనుకున్నారు. రోడ్డు పక్కనే ఉన్న భూమిలో గుంతలు తవ్వి, పిల్లర్లు వేయడానికి పునాదులు తీశారు. మరోసారి రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో అధికారులు అలా వచ్చి ఇలా వెళ్లిపోయారు. అనంతరం టీడీపీ నాయకుల ప్రోద్బలంతో అక్రమ నిర్మాణాలను కొనసాగించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కబ్జాదారులు దౌర్జన్యానికి దిగడంతో పాటు దాడికి యత్నిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అధికారులే పరోక్షంగా వారికి సహకరిస్తున్నారని మండిపడుతున్నారు. ఉన్నతాధికారులైనా దృష్టి సారించి ప్రభుత్వ కాలువ భూమిని పరిరక్షించాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి ఘన నివాళి



నరసింహులు నాయుడు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



లోకనాథరెడ్డి ఇంట హర్షిత్‌రెడ్డి, నరేష్‌రెడ్డి తదితరులు

తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహులునాయుడుకు పలువురు ఘన నివాళులర్పించారు. ఆదివారం ఆయన దశదిన కర్మక్రియలకు తుడా మాజీ చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరయ్యారు. ఆయన స్వగ్రామమైన ఎస్ఆర్‌పురం మండలం బసిరెడ్డిపల్లెకు వెళ్లి నరసింహులు నాయుడు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి, వైఎస్ఆర్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి నివాళులు అర్పించారు.

చిన్నారికి ఆశీస్సులు

పాకాల : మండలంలోని గాదంకి పంచాయతీ గుంతగాదంకికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత లోకనాథరెడ్డి మనవడు కేశఖండన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, రమేష్, రుకేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మధు, రహీమ్, చొక్కలింగం, గోపి, సతీష్‌రెడ్డి, జ్యోతిరెడ్డ, స్థానికులు పాల్గొన్నారు.

తప్పిపోయిన యువతి బంధువులకు అప్పగింత



యువతిని బంధువులకు అప్పగిస్తున్న సంధ్య

పాకాల: మానసిక స్థితి సరిగా లేని ఓ యువతిని ఎట్టకేలకు బంధువులకు అప్పగించారు. ఆ యువతి తప్పిపోయి శనివారం మండలంలోని కుందేటిపల్లెకు చేరుకోవడం విదితమే. ఆదివారం ఐసీడీఎస్ పాకాల సెక్టార్ సూపర్‌వైజర్ కిరణ్మయి మాట్లాడుతూ, ఆ యువతిని గ్రామస్తులు, తమ అంగన్‌వాడీ సిబ్బంది సహకారంతో రక్షించి, కుందేటివారిపల్లె అంగన్‌వాడీ కార్యకర్త సంధ్య సంరక్షణలో ఉంచినట్టు చెప్పారు. ఆ యువతి తన పేరు చిన్ని అని చెప్పిందని, ఆమె తెలిపిన వివరాల మేరకు రేణిగుంట మండలం మామండూరులోని సమీప బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. మానసిక స్థితి సరిగా లేకపోవడంతో అప్పుడప్పుడూ ఇలా వెళ్లిపోతుంటుందని బంధువులు పేర్కొన్నారు.

బాలసుబ్రమణ్యంకు అరుదైన అవకాశం



బాలసుబ్రమణ్యం

తిరుపతి సిటీ: ఎస్వీయూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డాక్టర్ ఎస్.బాలసుబ్రమణ్యంకు ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ సైన్స్, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎడిటోరియల్ బోర్డులో సభ్యత్వం కల్పిస్తూ అంతర్జాతీయ సంస్థ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఆయన ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ అండ్ సైన్స్, ఎడ్విన్ గ్రూప్ ఆఫ్ జర్నల్స్ వంటి ప్రముఖ పత్రికల ఎడిటోరియల్ బోర్డులోనూ, ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఇన్ టెక్నాలజీ, జర్నల్ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్ వంటి అంతర్జాతీయ పత్రికలకు సమీక్షకుడిగా వ్యవహరిస్తున్నారు.

నృత్య సమ్మోహనం



శాస్త్రీయ నృత్యం చేస్తున్న చెన్నై కళాకారులు

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చెన్నైకు చెందిన శ్రీశంకర నాట్య విద్యాలయం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనలు ఇచ్చారు. పలు తమిళ కీర్తనలు, గీతాలకు కళాకారులు సాయిదర్శిని, కిరుతికా, యజ్ఞిని, పల్లవి, యాసికా, థానిష్కా, హాన్షికా, శివాని, కావ్య, కారుణ్య, కామలి శ్రీ, నిథిలా తమ నృత్యంతో సమ్మోహితుల్ని చేశారు. ఏఓ సూర్యతేజ కళాకారులను సత్కరించారు.

తిరుపతిలో టీడీపీని భ్రష్టుపట్టిస్తున్న నేతలు

–యువనేత పేరిట రవినాయుడు గ్రూపు రాజకీయం

తిరుపతి కల్చరల్: బయట నుంచి వచ్చి తిరుపతి నియోజకవర్గంలో తిష్టవేసిన శాప్ చైర్మన్ రవినాయుడు తిరుపతిలో యువనేత పేరిట గ్రూపు రాజకీయాలు నడుపుతూ తెలుగుదేశం పార్టీని భ్రష్టుపట్టించడమేకాక మంత్రి లోకేష్ ఆశయాలను దెబ్బతీస్తున్నారని టీడీపీ నేతలు పెరుమాల మధు, ఆముదాల తులసీరాం విమర్శించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ కోసం కష్టపడుతున్న పార్టీ సీనియర్ నేతలను, కార్యకర్తలను సైతం పూర్తిగా విస్మరించి, అంతా తానై పార్టీలో రవినాయుడు విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. తిరుపతి గంగమ్మ ఆలయ పాలక మండలి నియామకంలో సైతం పార్టీ ఇన్‌చార్జ్ సుగుణమ్మను విస్మరించి, ఏరోజూ పార్టీ జెండా పట్టని వారిని, పార్టీ కోసం పని చేయని వారిని పాలక మండలి సభ్యులుగా నియమించడం విడ్డూరమన్నారు. పార్టీ కోసం కష్టపడిన మహిళలకు పాలక మండలిలో చోటు కల్పించకపోవడం అన్యాయమన్నారు. పార్టీకి నష్టం కలిగించే ఇలాంటి వారిపై పార్టీ అధిష్టానం చర్యలు తీసుకొని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీడీపీ నేతలు అశోక్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కళల వికాసంతో సమాజ శ్రేయస్సు



జానపద నృత్య విభాగంలో ప్రథమ బహుమతి పొందిన ఐక్యూ డ్యాన్స్ అకాడమీ కళాకారులు

తిరుపతి కల్చరల్: కళల వికాసంతోనే సమాజ శ్రేయస్సు అని, ఆ దిశగా కళలను, కళాకారులను ప్రోత్సహించాలనిపలువురు వక్తలు పిలుపునిచ్చారు. రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో మూడు రోజుల జాతీయ స్థాయి శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. బహుమతుల ప్రదానోత్సవం ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, టీటీడీ విశ్రాంత డెప్యూటీ ఈవో చిన్నంగారి రమణ, పారిశ్రామికవేత్త డాక్టర్ పీసీ.రాయులు, తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, బీఎంఎస్ నేత ఆకుల సతీష్ ప్రసంగించారు.అనంతరం శతావధాని, ప్రవచనకర్త భారత్ శరమను అవధానిని కౌముది పురస్కారంతో సత్కరించారు. జానపద నృత్య పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా ఐక్యూ డ్యాన్స్ అకాడమీ(గుడివాడ), శివజ్యోతి నృత్యాలయ, నాట్యరవళి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ కళాకారులు(విశాఖ)నిలిచారు. శాస్త్రీయ బృంద నృత్య విభాగంలో నారాయణ నృత్యాలయ (విజయనగరం), శ్రీలక్ష్మీ భరత నాట్యాలయం(చిత్తూరు), నాట్యరవళి మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ(విశాఖపట్నం) కళాకారులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. వీరందరినీ నగదు, జ్ఞాపికలతో సత్కరించారు.

ఒకే పెన్షన్ విధానం అమలుకు వినతి



వినతిపత్రం పరిశీలిస్తున్న లోక్ సభ స్పీకర్

తిరుపతి అర్బన్ : ఒకే నేత ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పనిచేస్తే అన్నింటికీ పెన్షన్లు పొందుతున్నారని, అలా కాకుండా అన్నింటికీ ఒకే పెన్షన్ విధానం అమలు చేయాలని డబ్ల్యూడీ గణేష్ అనే వ్యక్తి కోరారు. ఆదివారం నిర్వహించిన మహిళా సాధికారత కమిటీ జాతీయ సదస్సులో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు వినతి పత్రం ఇచ్చారు. పార్లమెంటరీ జీతాలు, పెన్షన్స్‌కు సంబంధించి 1954 చట్టం సవరించాలని కోరారు.

ఏఈఈలుగా గుర్తించరూ: ఏపీ బయోమెడికల్ అసోసియేషన్



ఇంజనీర్స్ డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

తిరుపతి తుడా: తమిళనాడు, కేరళ రాష్ట్రంలో అవలంబిస్తున్న విధంగా ఆంధ్రప్రదేశ్‌లో బయోమెడికల్ ఇంజినీర్లను ఏఈఈ క్యాడర్‌గా గుర్తించాలని ప్రభుత్వాన్ని ఏపీ బయోమెడికల్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. తిరుపతిలో జరిగిన సమావేశంలో వారు తమ సమస్యలపై గళం విప్పారు. అనంతరం జాతీయ ఇంజనీర్స్ డే సందర్భంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బయోమెడికల్ ఇంజినీర్స్ ప్రెసిడెంట్ రెహానా పర్వీన్, అసోసియేట్ ప్రెసిడెంట్ సందీప్ రెడ్డి, కోశాధికారి రవి వర్మ పాల్గొన్నారు.

జీజేఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడిగా రవి



రవిని సన్మానిస్తున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఏపీ రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల అసోసియేషన్ (జీజేఎల్ఏ) అధ్యక్షుడిగా చంద్రగిరి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు చెందిన ఎకనామిక్స్ అధ్యాపకులు వి.రవి ఎంపికయ్యారు. ఆదివారం తిరుపతి ఆఫీసర్స్ క్లబ్‌లో రాష్ట్ర స్థాయి అసోసియేషన్ సాధారణ సమావేశం నిర్వహించారు. 2025–2028కి సంబంధించి ఆయనను అధ్యక్షుడిగా, గుంటూరుకు చెందిన అధ్యాపకులు నాగరాజును సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ, తననీ పదవిలో ఎంపిక చేయడం 4వసారి అని, అధ్యాపకులు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిబద్ధతతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

'తిరుపతి నగరవనం' ఆవిష్కరణ



తిరుపతి కల్చరల్: ట్రెక్కింగ్ బాలు,(బీవీ.రమణ) రచించిన 'తిరుపతి నగరవనం' పుస్తకాన్ని ఆదివారం కపిలతీర్థం సమీపాన దివ్యారామంలోని నగరవనంలో ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ పి.మల్లిఖార్జునరావు, ఏపీ రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సి.సెల్వం, జిల్లా ఫారెస్ట్ అధికారి పి.వివేక్, రాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎల్.వర్మ, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

నేడు ఎస్వీయూలో విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఎన్నడూ లేని విధంగా సమావేశాలకు సెమినార్ హాళ్లు, ఆడిటోరియాంలు ఇవ్వకుండా వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ జారీ చేసిన అప్రజాస్వామిక ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.